# ఇదోరకం ముష్టి !



**1987**



"ఏ భాషనైనాసరే ఇరవైనాల్గంటల్లో నేర్చుకుంటాను."

బస్సు ప్రయాణం చేస్తోన్న నేను.... - నా ముందు సీట్లోంచి విన్పిస్తోన్న మాటలకి... నాలో నేనే నవ్వుకున్నాను !


21

“ నాకు ఆరు భాషలూ అనర్గళంగా .... మాట్లాడటం, రాయడం, చదవడం వచ్చు!”

“ అలాగా !?!”

“ నా పేరు సుభాష్! నాకో వైన్‌షాప్ వుంది! ఎక్సైజ్ కాంట్రాక్టర్‌ని”

“ ఓహో...!?”

శ్రోత పొడిపొడిగా సమాధానం చెప్తున్నాడు.

“ రోజుకో భాష నేర్చుకునే సత్తా వున్న నీకు... నీ ముప్పయేళ్ళజీవితంలో కనీసం ఒక ఇరవైయేళ్ల కాలాన్ని లెక్కలోకి తీసుకున్నా - ఈ పాటికి ఓ ఏడువేల భాషలైనా వచ్చి వుండాలే! ఆరు భాషలంటే.... అదో క్రెడిటా... షేమ్ కాకపోతే !?” నా పక్కసీట్లో కూర్చున్న కాలేజీ అమ్మాయి తన ఫ్రెండ్‌తో కామెంట్ చేసింది.

“ చూడండీ, నాకు యద్దనపూడి సులోచనారాణి, దాశరథి రంగాచార్య, యండమూరి వీరేంద్రనాథ్, మల్లాది ఒకరేమిటీ... పేరుమోసిన రచయితలందరూ తెలుసు! ఎన్నో సాహితీ సంస్థలను స్థాపించాను! లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్‌ని! ఇంకా చెప్పాలంటే.... ఫ్రీలాన్స్ జర్నలిస్టుని. మావూరి దేవాలయ కమిటీకి సెక్రటరీని. అయ్యో, చెప్పడం మరిచిపోయా....! యన్నార్కే పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపకుణ్ణి! ఒకరకంగా.... నేను రింగ్ లీడర్ని అని చెప్పుకోవచ్చు....! ఏమండీ... వింటున్నారా?”

శ్రోత మొహం మరోవేపుకి తిప్పుకున్నాడు.

“ ఇదిగో - ఇది... నేను మొన్న ఢిల్లీ వెళ్ళినప్పుడు రాజీవ్‌గాంధీ, సోనియా గాంధీలతో తీసుకున్నఫోటో! సోనియాగాంధీ నేను ఢిల్లీ వెళ్ళినప్పుడు ఫోన్‌చేస్తే చాలు.... నేనెక్కడున్నా కారు పంపి.... నన్ను వాళ్ళింటికి పిలిచి, రాజకీయ విషయాలు మాట్లాడ్తుంది. ఎంతైనా పత్రికావిలేకర్ని కదా...! మాకు చాలా ప్రిఫరెన్స్ ఇస్తారు ! వాజ్‌పాయ్, ఉపేంద్ర కూడా అంతే.... నాకు ఎంత రెస్పాన్స్ ఇస్తారో చెప్పలేను !”

నాకెందుకో అతడి మాటల్ని వింటోన్న శ్రోతని చూడాలనిపించింది!

పాపం... ఆయన... అదేపనిగా కణతలు రుద్దుకుంటున్నాడు.

ఏదో స్టేషన్‌లో బస్సాగింది ! అందర్నీ తోసుకుంటూ ఒక ముష్టివాడు బస్సెక్కాడు. ఒక్కొక్కర్నే అడుక్కుంటూ.... వచ్చి, సుభాష్ రెండు కాళ్ళూ పట్టుకున్నాడు.

“అయ్యా... అన్నం తినక ఇరవై నాల్గంటలైంది ! ఆకల్తో కడుపు నకనక లాడ్తోంది! కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి, ఒక పావలా ధర్మం చేయండిబాబూ... మీకు పుణ్యం వుంటుంది!”

కాళ్ళు వదలకుండా అదేపనిగా బతిమాలుతున్నాడు....

సుభాష్ చీదరగా ముఖంపెట్టి, శ్రోతతో చెప్తున్నాడు: “ నాకీ ముష్టెత్తుకునే వాళ్ళంటే... ఎంత అసహ్యమో చెప్పలేను! దున్న పోతల్లే ఎలా వున్నాడో చూడండీ! వీడికి కాళ్ళు వంకరా... కన్ను వంకరా...? ఏదైనా పని చేసుకొని బతకొచ్చుకదా ! అబ్బే, పనిచేయడానికి బద్ధకం - సోమరితనం! ఈ యాచకవృత్తిని నిషేధించా లంటూ ఒక అర్టికల్ రాస్తున్నాను. అది వచ్చే ఆదివారం ‘ఈనాడు’ పేపర్లో

రాబోతోంది. మీరు అది చదివి ఎలావుందో నాకు రాయండి.... ఏమండీ వింటున్నారా?"

శ్రోత మాట్లాడకుండా ఆవలింతలు మొదలుపెట్టాడు...

"నేను ఇరవైనాల్గంటల్లో ఎవర్నైనాసరే సస్పెండ్ చేయించగలను. మీక్కూడా ఏమైనా ప్రాబ్లెమ్స్ వుంటే చెప్పండి! మన ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు కూడా నాకు బాగా తెలుసు ! ఆయన అల్లుడు చంద్రబాబు నాయుడు నా క్లాస్‌మేట్ - నిముషాల్లో మీపని పూర్తి చేయిస్తాను !"

"మీ కెందుకండీ శ్రమ !": శ్రోత గొంతులో వ్యంగ్యం.

"శ్రమేముందండీ.... 'పరోపకారార్థ మిదం శరీరం' అన్నారు... ఇలా నల్గురికీ సాయపడటమే నా లక్ష్యం ! ఇదిగో నా అడ్రస్! మీకే పనికావాలన్నా ఈ అడ్రస్‌కి ఒక ఉత్తరమ్ముక్క రాయండి చాలు !"

ఇంతలో బస్సు ఆగింది ! సుభాష్ అనబడే వ్యక్తి దిగిపోయాడు.... ఓ సంచీ నిండా కాగితాల్ని మోసుకుంటూ.

అతడలా దిగాడోలేదో - అంతవరకూ అతడి మాటల్ని ఓపిగ్గా విన్న ఆ పెద్దమనిషి సర్దుక్కూర్చుని: "అమ్మయ్య ! వడగళ్ళ వానపడి వెలిసినట్టుగా ఉంది! మొహమాటానికి పోయి వెధవ బోర్‌ని భరించాను... రెండు గంటల్నుండీ ! ఇరవై నాల్గంటల్లో ట్రాన్స్‌ఫర్ చేయిస్తాడట... ట్రాన్స్‌ఫర్ ! వీడికి నా పక్కనే సీట్ దొరకాలా - నా ఖర్మకాకపోతే!? జోరీగలా ఒకటే రొద !" అంటూ తన పక్క సీటాయన్తో చెప్తున్నాడు....

నవ్వుకుంటూ కిటికీలోంచి బయటికి చూశాను.

నేను కూర్చున్న కిటికీ దగ్గర నించొని సుభాష్.... మళ్ళీ ఎవర్తోనో మాట్లాడ్తున్నాడు: "నా పేరు సుభాష్ ! నేను ఏ భాషనైనా సరే ఇరవైనాల్గంటల్లో నేర్చుకుంటాను...."

వడగళ్ల వాన మళ్ళీ మొదలు ! ఈసారి కర్ణ కఠోరంగా... అరిగిపోయిన గ్రామ్ ఫోన్ రికార్డ్లల్లే.

వెంటనే విండోగ్లాస్ దించి కూర్చున్నాను.

ఇదే బస్సులోంచి దిగాడేమో... ఇందాకటి ముష్టివాడు... అందర్నీ అడుక్కుంటూ.... సుభాష్ మాట్లాడ్తోన్నాయన పక్కన... ప్రత్యక్ష మయ్యాడు:

"అయ్యా, అన్నం తినక ఇరవై నాల్గంటలైంది. ఆకల్తో కడుపు నకనక లాడ్తోంది. ఓ పావలా దానం చేయండి బాబూ, మీకు పుణ్యముంటుంది." ఒక్కొక్కరి దగ్గరికి వెళ్ళి చెప్పిన మాటల్నే చెప్పుకుంటూ, వాళ్ళ దూషణచీత్కారాల్ని లెక్క చేయకుండా... డబ్బు అడుక్కుంటున్నాడు!

నేనెందుకో సుభాష్‌నీ... ఆ ముష్టివాణ్ణీ మార్చి మార్చి చూశాను....

సుభాష్ దృష్టిలో అది సోమరితనాన్ని పెంచే... ముష్టి !

అయితే తనకి ఎదురైనవాళ్ళందర్తో - అసలు తన మాటలు వాళ్లకి ఆసక్తికరంగా

వున్నాయోలేవో కూడా గమనించకుండా... తన గొప్పలు చెప్పిందే చెప్పుకుంటూ.... ఎదుటి వాళ్ళ నుండి తన కొక 'గుర్తింపు' ను అడుక్కుంటున్నాడు.... సుభాష్ !

**మరి అతడిది.... ఏ రకం ముష్టి !?**

**-కేకలు, వీక్లీ**
**నవంబర్, 1987**

**అంకితం**



**శ్రీమతి సిహెచ్. లలితాదేవి,** M.A.,B.O.L.
**కామారెడ్డి.**

శబ్దాలను పొందికగా పేర్చి, కూర్చి - తగిన అర్థాలను పలికించి... వచన రచన చేసే నేర్పు - ఆమెకి సొంతం!

తక్కువ సమయంలో - చక్కని తెలుగులో - అందంగా వ్యాఖ్యానాలు రాసి... అతిథుల్ని అలరించడంలో ఆమెకు ఆమే సాటి!

ఆమె... గొప్ప వక్త! భాషణం... ఆమె భూషణం !
పలు సాహితీ కార్యక్రమాల్ని మనోరంజకంగా నిర్వహించడంలో ఆమె సిద్ధహస్తురాలు!

ఏ అంశమిచ్చినా... అందంగా, ఆశువుగా దానికి తన కథనం జోడించి - అనర్గళంగా ఉపన్యసించి - సభికుల్ని రంజింపచేయగలిగే నా స్నేహితురాలు, ఉత్తమ అధ్యాపకురాలు: **సిహెచ్. లలితాదేవి** కి...

ప్రేమతో....

1-11-2005